సాక్షి గుంటూరు

బుధవారం । 16 । జూలై । 2025



పోలేరమ్మకు సారె సమర్పణ

పాతనందాయపాలెం(కర్లపాలెం): స్థానిక గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారికి మహిళలు మంగళవారం ఆషాఢ సారె సమర్పించి పూజలు చేశారు.



కనకదుర్గమ్మకు బోనాలు

పిడుగురాళ్ల: భవానీనగర్‌లోని కనకదుర్గ అమ్మవారికి మంగళవారం బోనాలు సమర్పించారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రేపటి నుంచి పవిత్రోత్సవాలు

మోపిదేవి:మోపిదేవిలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పవిత్రోత్సవ సహిత ఆషాఢ కృత్తిక మహోత్సవాలు ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

న్యూస్‌రీల్

556.60 అడుగులకు చేరిన సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 556.60 అడుగులకు చేరింది. ఇది 224.5548 టీఎంసీలకు సమానం . సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,650 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 64,789 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

'స్థానిక' పరిపాలనలో మహిళా భాగస్వామ్యం పెరగాలి

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



గుంటూరు ఎడ్యుకేషన్ : స్థానిక సంస్థల పరిపాలనలో మహిళా భాగస్వామ్యం పెరగాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. గుంటూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం ''మహిళా నాయకత్వంలో మార్పు–స్థానిక స్వపరిపాలనలో సాధికారత'' అనే అంశంపై మహిళా జెడ్పీటీసీలు, ఎంపీటీసీలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్జీఎస్ఏ) వార్షిక ప్రణాళిక 2025–26లో భాగంగా ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్న మాట్లాడుతూ మహిళా నాయకత్వంలో మార్పు ద్వారా స్థానిక పాలనలో స్వపరిపాలన సాధ్యపడుతుందని అన్నారు. గ్రామస్థాయిలో మహిళా ప్రజా ప్రతినిధులు కీలకపాత్ర పోషించాలని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే శిక్షణా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని సూచించారు.

అమృత భారత్ పనుల పరిశీలన



నరసరావుపేట: గుంటూరు–హుబ్లీ మార్గంలోని నరసరావుపేట, వినుకొండ, దొనకొండ రైల్వే స్టేషన్లను మంగళవారం డీఆర్ఎం సుథేష్ట సేన్ తనిఖీ చేశారు. ఆయా స్టేషన్లలో అమృత భారత్ కింద చేపట్టిన పలు అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గుంటూరు అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం.రమేష్‌కుమార్, డెప్యూటీ చీఫ్ ఇంజనీర్ ఎంఏ నోయల్, గుంటూరు సీనియర్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, గుంటూరు సీనియర్ డీసీఎం డాక్టర్ సీహెచ్.ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఈద్గా స్థలం కోసం క్షేత్రస్థాయి పరిశీలన



యడ్లపాడు: ఈద్గా స్థలం కేటాయింపునకు సంబంధించి ముస్లిం ప్రతినిధులు చేసిన వినతిని పరిగణలోకి తీసుకున్న జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, ఆర్డీఓ మధులత కోట గ్రామాన్ని సందర్శించారు. మంగళవారం స్థానికంగా ఉన్న ప్రతిపాదిత భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈద్గా కోసం అభ్యర్థించిన స్థలం మొత్తం 51 సెంట్లు ఉందని, ఇది రెండు రెవెన్యూ డివిజన్ల పరిధిలో, మూడు సర్వే నంబర్లలో విస్తరించి ఉందన్నారు. అందులో కొంత భాగం స్మశానం, కాలువ, ఖాళీ భూమిగా ఉందన్నారు. స్థానికుల వినతిని దృష్టిలో ఉంచుకుని అన్ని అంశాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. తహసీల్దార్ జెట్టి విజయశ్రీ, సర్వేయర్ సురేంద్రనాథ్, ఆర్ఐ సుబ్బారావు, వీఆర్వో బాబురావు ఉన్నారు.

ఢిల్లీ వెళ్లిన మేయర్, కమిషనర్

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్) : స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థకు కేంద్రం ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ సూపర్ లీగ్ సిటీ అవార్డ్‌ను ఈ నెల 17న ఢిల్లీలో ప్రదానం చేయనున్నారు. ఈ నేపథ్యంలో అవార్డును అందుకునేందుకు మంగళవారం రాత్రి నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు ఢిల్లీ పయనమయ్యారు.

అవినీతి మయం

నాణ్యత దూరం

ఏఎన్‌యూ దూరవిద్య పరీక్షల్లో భారీ అక్రమాలు

- విద్యాశాఖ మంత్రి నివాసానికి కూతవేటు దూరంలో విద్యావ్యాపారం
- పచ్చచొక్కాల ఆధ్వర్యంలో పైసల చాటున పరీక్షలు
- పరీక్షల పేరిట స్టడీ సెంటర్ల దందా
- ప్రతి దానికి ఒక రేటు..
- ఏఎన్‌యూ పరిధిలో 'పచ్చ'గా పరీక్షల వ్యాపారం



సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూర విద్యా పరీక్షలు అక్రమాలకు నిలయంగా మారాయి. విద్యాశాఖ మంత్రి నియోజకవర్గానికి ఆనుకుని ఉన్న విశ్వవిద్యాలయంలో దూర విద్య పరీక్షల పేరిట రూ.కోట్ల విద్యా వ్యాపారం జరుగుతుంటే అడ్డుకునేవారే లేకుండా పోయారు. ఈనెల 10 నుంచి ప్రారంభమైన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూర విద్యా యూజీ, పీజీ పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా 112 పరీక్షా కేంద్రాల్లో జరుగుతున్నాయి. దాదాపు 72 వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. వర్సిటీలోని కొందరు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పచ్చచొక్కాల నాయకులమంటూ పరీక్షల్లో రూ.కోట్ల అక్రమ వ్యాపారానికి తెరలేపారు. జిల్లాలోని ఒక ఎంపీ బంధువునంటూ ఒక నాన్‌టీచింగ్ ఉద్యోగి.. ఒక శాసనసభ్యుడికి అత్యంత సన్నిహితుడిని అంటూ ఒక అధికారి.. టీడీపీ నేతలమంటూ ఇద్దరు నాన్‌టీచింగ్ ఉద్యోగులు, ఒక అతిథి అధ్యాపకుడు ఈ విద్యా వ్యాపారంలో కీలక వ్యక్తులుగా మారారు.

వీరి రూటే సెప'రేటు'

స్టడీ సెంటర్స్ ద్వారా ఏఎన్‌యూ అధికారులు రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. దూర విద్యలో ప్రతి దానికి ఒక రేటు చొప్పున దండుకుంటున్నారు. పర్సనల్ కాంటాక్ట్ ప్రోగ్రామ్ (పీసీపీ) కింద ఇటీవల రూ.4కోట్ల వరకూ చెల్లింపులు జరిగినట్లు సమాచారం . ఈ మొత్తంలో 20 శాతం కమీషన్లు ఒక ఉద్యోగి ఆధ్వర్యంలో వసూలు చేశారు. గతంలో పలు మార్లు సస్పెండ్ అయిన సదరు అవినీతి ఉద్యోగి రూ.80 లక్షల నుంచి రూ. 90 లక్షల వరకు స్టడీ సెంటర్స్ నుంచి సేకరించినట్లు యూనివర్సిటీ సిబ్బంది చెబుతున్నారు. ఆలస్యంగా ఫీజు చెల్లించే విద్యార్థులకు కేటాయించే బఫర్లకు కూడా రేట్లు పెట్టి వసూలు చేస్తున్నారు. కొన్ని సెంటర్స్‌కు బఫర్ బుక్‌లెట్‌ను ఒక్కోటి రూ.100 నుంచి రూ. 200 చొప్పున పదివేలకు పైగా విక్రయించి భారీగా సొమ్ము చేసుకున్నారు.

ఒక్కో దానికి ఒక్కో రేటు

ఇంటి దగ్గర పరీక్ష రాస్తే ఒక రేటు.. పుస్తకం చూచి రాస్తే మరో రేటు.. విద్యార్థి బదులు మరొక వ్యక్తి పరీక్ష రాస్తే రెట్టింపు రేటు అంటూ రాష్ట్రవ్యాప్తంగా అనేక స్టడీ సెంటర్లు ఒక్కో రేటు చొప్పున నిర్ణయించి వసూలు చేస్తున్నాయి. పుస్తకాలతో చూచిరాస్తే ఒక్కో పరీక్షకు రూ. 500 నుంచి రూ. 1500 వరకు వసూలు చేస్తున్నారు. ఒక విద్యార్థి బదులు మరొకరు పరీక్ష రాస్తే రూ. 1500 – రూ. 2 వేలు దండుకుంటున్నారు. కొన్ని స్టడీ సెంటర్లలో ఇంటి దగ్గర పరీక్ష రాసే అవకాశం కల్పించి ఒక్కో పేపర్‌కు రూ. 2వేల నుంచి రూ. 5వేల వరకు వసూలు చేస్తున్నారు. ఈ కాపీయింగ్ రేట్లను వర్సిటీలోని కొందరు సిబ్బందే నిర్ణయించడం కూటమి అవినీతి పాలనకు నిదర్శనంగా నిలిచింది.

మా ప్రభుత్వం.. మా ఇష్టం

వర్సిటీలోని కొందరు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది తాము అధికార టీడీపీ నేతలమంటూ.. మా ప్రభుత్వంలో మా ఇష్టం అంటూ దూర విద్య పరీక్షలను రూ.కోట్ల ఆదాయాన్ని ఇచ్చే వ్యాపారంగా మార్చారు. జిల్లాలోని ఒక కీలక శాసనసభ్యుడి అనుచరుడినంటూ దూర విద్యలో ఒక కీలక పదవి దక్కించుకున్న ఓ అధికారి ఈ అక్రమ వసూళ్లలో కీలకంగా వ్యవహరిస్తున్నాడు. గతంలో కూడా టీడీపీ ప్రభుత్వంలో పరీక్షల విధులు నిర్వహించిన ఈయన అనేక ఆరోపణలు ఎదుర్కొన్నాడు. గతంలో వర్సిటీ దస్త్రాలు తస్కరించాడనే ఆరోపణలతో పోలీసు విచారణ ఎదుర్కొన్న ఒక నాన్‌టీచింగ్ ఉద్యోగి దూర విద్య అక్రమాల్లో కీలక పాత్రధారి అని వర్సిటీలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పక్క జిల్లాలోని ఒక ఎంపీ బంధువునంటూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పెత్తనం మొదలు పెట్టిన అధికారి దూరవిద్యా పరీక్షలను శాసించే స్థాయికి ఎదిగాడు.

మంత్రి గారు... పట్టించుకోరూ..!

విద్యాశాఖ మంత్రి ఇంటి సమీపంలోని వర్సిటీలో కోట్లాది రూపాయల అక్రమాలు జరుగుతున్నా.. సదరు అమాత్యులు కనీసం దృష్టి సారించడం లేదు. వర్సిటీలో ఒక వైపు విజిలెన్స్ తనిఖీలు జరుగుతున్నా.. దూర విద్యకేంద్రాల్లో జరుగుతున్న కలెక్షన్ల గురించి వారు సైతం పట్టించుకోకపోవడం గమనార్హం.

తూతూమంత్రంగా పరిశీలన

నిక్కచ్చిగా, నిష్పక్షపాతంగా పరీక్ష విధులు నిర్వహించేవారిని పరిశీలకులుగా నియమించాల్సిన వర్సిటీ అధికారులు పచ్చ చొక్కాల పైరవీలతో వారి అనుకూలమైన వారిని నియమిస్తున్నారు. గత ఏడాది భారీగా డబ్బులు వసూలు చేశారనే ఫిర్యాదులు వచ్చిన వారిని ఈ ఏడాది కూడా పరిశీలకులుగా నియమించారు. వర్సిటీలో పనిచేసే నాన్ టీచింగ్ సిబ్బంది బంధువులకు, విద్యార్థి సంఘాల నాయకులకు, టీడీపీ సామాజిక వర్గానికి చెందిన వారికి అనుబంధ కళాశాలల లెక్చరర్లు అంటూ విధులను కేటాయించారు.

దళితులపై వరుస దాడులు

హోం మంత్రి ఏం చేస్తున్నారు?



నాగమల్లేశ్వరరావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్, అంబటి మురళీకృష్ణ

- యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్
- టీడీపీ నేతల దాడిలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో ఉన్న నాగమల్లేశ్వరరావు కుటుంబ సభ్యులకు పరామర్శ

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): దళిత వర్గాలపై మూకుమ్మడి దాడులు జరుగుతుంటే... దళిత హోంశాఖ మంత్రి అనిత ఏం చేస్తున్నారని ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ప్రశ్నించారు. దళితులపై జరుగుతున్న దాడులపై హోం మంత్రి స్పందించాలని, వాటిని ఖండించకపోతే దళిత జాతి క్షమించదన్నారు. దాడులకు గురైన దళితులను పరామర్శించే సమయం కూడా లేదా అని ధ్వజమెత్తారు. పొన్నూరు నియోజకవర్గం మన్నవ గ్రామంలో టీడీపీ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడి రమేష్ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న బొనిగల నాగమల్లేశ్వరావును చూసేందుకు యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణతో కలిసి గుంటూరు వచ్చారు. నాగమల్లేశ్వరరావు కుటుంబ సభ్యులను కలిసి వారికి ధైర్యం చెప్పి, నాగమల్లేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

దళితులంటే టీడీపీ నేతలకు చిన్నచూపు

ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర గతంలోనూ... ఇప్పుడు రౌడీ రాజకీయాలు మానుకోలేదని ధ్వజమెత్తారు. అసలు దళితులంటేనే చంద్రబాబుకు, టీడీపీ నేతలకు చిన్నచూపని, దళితులలో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని చంద్రబాబు మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు.

ఇక పొన్నూరు నియోజకవర్గంలో బలమైన రాజకీయ నేపథ్యం ఉన్న నాగమల్లేశ్వరరావును ధైర్యంగా ఎదుర్కోలేక అంతం చేయాలని ప్లాన్ చేశారని ఆరోపించారు. గత 13 రోజులుగా నాగమల్లేశ్వరరావు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నా.. కూటమి ప్రభుత్వంలోని ఏ మంత్రి, ఎమ్మెల్యే పరామర్శించకపోవటం సిగ్గుచేటన్నారు. నాగమల్లేశ్వరరావు కుటుంబానికి పూర్తిస్థాయిలో అండగా ఉంటామని తెలిపారు.

నరేంద్రను ఏ1గా చేర్చాలి

వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర, నాగమల్లేశ్వరావుపై దాడిని చేయించటమే కాకుండా, ఆయన ప్రాణాల కోసం పోరాడుతుంటే.. ఏదో చిన్న ఘటనను పట్టుకుని గగ్గోలు పెడుతున్నారని వ్యాఖ్యలు చేయటం సిగ్గుచేటన్నారు. ఈ ఘటనలో నరేంద్రను ఏ1గా చేర్చాలని డిమాండ్ చేశారు.

తాగునీటికి కటకట



తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ఇంజినీరింగ్ విభాగం అవుట్ సోర్సింగ్ సిబ్బంది

సమ్మె ప్రభావం.. నగరంలో తాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): సమస్యలు పరిష్కారించాలనే డిమాండ్‌తో ఈ నెల 13వ తేదీ నుంచి మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె ప్రభావం గుంటూరు నగరంలో తాగునీటి సరఫరాపై స్పష్టంగా కనిపిస్తోంది. నగరపాలక సంస్థ పరిధిలో హెడ్ వాటర్ వర్క్(తక్కెళ్లపాడు), ఉండవల్లిలో పనిచేసే ఇంజినీరింగ్ విభాగం అవుట్ సోర్సింగ్ సిబ్బంది విధులకు గైర్హాజరవడంతో నగరంలో తీవ్ర తాగునీటి సమస్య ఉత్పన్నమవుతోంది. గుంటూరు నగరానికి కృష్ణా నది నుంచి రా వాటర్ ఉండవల్లి పంపింగ్ హౌస్ నుంచి తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్‌కు వస్తుంటుంది. ఇక్కడ ఫిల్టర్ అయిన తరువాత గుంటూరు నగరంలో 64 వాటర్ ట్యాంకులకు సరఫరా అవుతాయి. దీంతో పాటు సంగం జాగర్లమూడి నుంచి గుంటూరుకు తాగునీరు సరఫరా అవుతుంది. ప్రధానంగా కృష్ణా నది నుంచి గుంటూరుకు 135 ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్ పర్ డే), సంగం జాగర్లమూడి నుంచి సుమారు 20 ఎంఎల్‌డీ నగరానికి సరఫరా అవుతుంది. కృష్ణా నది నుంచి వచ్చిన రా వాటర్‌ను తక్కెళ్లపాడులో కార్మికులు ఫిల్టరైజేషన్ ద్వారా శుద్ధీకరిస్తుంటారు. అయితే కార్మికుల గైర్హాజరీతో లేక ఫిల్టరైజేషన్‌కు, సరఫరాకు గండిపడింది.

ప్రైవేట్ వ్యక్తులతో విధులు.. కాలిపోయిన మోటార్లు

కార్మికుల సమ్మె కారణంగా నగరపాలక సంస్థ అధికారులు రూ.వెయ్యి నుంచి 1500 చొప్పున ఇచ్చి ప్రైవేట్ వర్కర్లను విధుల్లోకి తీసుకుని వాటర్ పంపింగ్ జరిపేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అయితే వీరికి సరైన అవగాహన లేకపోవడంతో పంపింగ్ సమయంలో వేయాల్సిన మోటార్లు కాకుండా వేరే మోటార్లను ఆన్ చేయడం ద్వారా మోటార్లు కాలిపోయే పరిస్థితి నెలకొంది.

సగమే సరఫరా

దీంతో పాటు నగరానికి రావాల్సిన 150 ఎంఎల్‌డీలో కేవలం 70 నుంచి 80 ఎంఎల్‌డీ మాత్రమే తాగునీరు వస్తోంది. నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల వద్ద 24 గంటలు మోటార్లు రన్ అయితేనే పశ్చిమ నియోజకవర్గానికి పూర్తి స్థాయిలో తాగునీరు సరఫరా అవుతుంది. ప్రస్తుతం తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్ నుంచి నెహ్రూనగర్ వాటర్ ట్యాంకులకు ఆశించిన స్థాయిలో తాగునీరు రాకపోవడంతో 24 గంటలు రన్ అవ్వాల్సిన మోటార్లు..ఆగి ఆగి 10 గంటలు కూడా రన్‌కాని పరిస్థితి నెలకొంది. దీంతో పశ్చిమ ప్రజల గొంతు ఎండుతోంది.

పరిష్కారం చూపాలి

మాకు గత రెండు రోజులుగా తాగునీరు సక్రమంగా రావడం లేదు. దీంతో చేసేదేమి లేక మినరల్ వాటర్ కొనుక్కొని ఇంటిలో అవసరాలను తీర్చుకుంటున్నాం. అధికారులు స్పందించి తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలి.

– సాయి కిరణ్, రాజీవ్‌గాంధీనగర్

తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలి

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): కార్మికుల సమ్మె వలన నగరంలో తాగునీటి సరఫరాలో ఎటువంటి సమస్య ఉత్పన్నమవ్వకుండా ఇంజినీరింగ్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్‌ని పరిశీలించారు. కార్మికుల సమ్మె వలన తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా ఇంజినీరింగ్ అధికారులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి చర్యలు తీసుకోవాలన్నారు. ఉండవల్లి నుంచి నీటి సరఫరాకు, ఫిల్టరైజేషన్‌కు సమస్య రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఈఈని ఆదేశించారు.



తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్ వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్

భూ మాయ చేశాడు!

నకిలీ బీ ఫారాలతో ఓ పత్రికా విలేకరి భూ దందా

- తాడికొండలో ఖాళీ స్థలాలు, సామాజిక స్థలాలకు తప్పుడు బీ ఫారాలు సృష్టించి అక్రమ అమ్మకాలు
- తమ కుటుంబ సభ్యుల పేరిట కూడా నకిలీ పత్రాలు సృష్టించి గృహ నిర్మాణ పథకానికి దరఖాస్తు
- విషయం బయటకు పొక్కడంతో నకిలీ పత్రాలను బయటకు రాకుండా చూసేందుకు యత్నాలు
- రూ.5.50 లక్షలు ఒకే కుటుంబంలో టోపీ పెట్టడంతో నగదు తిరిగి ఇవ్వాలని బాధితులు డిమాండ్
- స్టాంపులు, వీఆర్వో రిపోర్టు, అధికారుల సంతకాలు, తహసీల్దార్ సంతకం సహా అన్నీ ఫోర్జరీ
- తమకు సంబంధం లేదని చేతులెత్తేసిన రెవెన్యూ అధికారులు.. చర్యలు తీసుకోవాలని బాధితుల డిమాండ్



బాధితులకు అంటగట్టిన నకిలీ బీ ఫారాలు

తాడికొండ: రాజధానిలో భూముల ధరలకు రెక్కలొచ్చి పద్దాయి. ఎకరం రూ.కోట్లు పలుకుతుంటే సెంటు భూమి దొరికితే చాలు జీవితాంతం చిన్నపాటి రేకుల షెడ్డు అయినా వేసుకొని బతికేద్దామని ఆశపడుతున్న పేదవాడి కష్టాన్ని దోచుకునేందుకు పక్కా స్కెచ్ వేసి దానిని అమలు చేశాడు ఓ ప్రధాన పత్రిక విలేకరి (సాక్షి కాదు). అనుకున్నదే తడవుగా తనకు రెవెన్యూ శాఖలో అంతా గుప్పెట్లో ఉందని, మీకు భూమి ఇప్పించే బాధ్యత తనదే అంటూ ప్రగల్భాలు పలికాడు. రూపాయి రూపాయి కూడబెట్టుకున్న ఓ పేద కుటుంబానికి వల విసిరి తీరా నిజం బయటకు పొక్కే సరికి తనకేం సంబంధం లేదంటూ చేతులెత్తేశాడు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ తంతు తాడికొండలో జరిగింది.

నకిలీ బీఫారాలు అంటగట్టి..

ఆ విలేకరి తనదైన శైలిలో భూ దందాకు తెరలేపి ప్రభుత్వం కేటాయించిన లే అవుట్లలో మిగిలిన ఖాళీ స్థలాలు ఎక్కడున్నాయో ఆరా తీసి రెవెన్యూ అధికారుల నుంచి మీకు స్థలం ఇప్పిస్తానంటూ ముందుగా ఆ స్థలాలను బాధితులకు చూపించాడు. రాజధాని ప్రాంతంలో తమకూ జాగా వస్తుందంటూ ఆశపడిన పలువురు ఇతని వలలో పడ్డారు. పేరు బయటకు చెప్పేందుకు ఇష్టపడని ఓ పేద కుటుంబానికి చెందిన ఇద్దరు మహిళలకు రెండు నకిలీ బీ ఫారాలు సృష్టించి అంటగట్టి ఇదే మీ స్థలమంటూ ప్రైవేటు సర్వేయర్‌తో కొలతలు వేయించి అప్పజెప్పి రూ.5.50 లక్షల నగదు తీసుకున్నాడు.

- ఇదేదో బాగుందనుకున్న ఆ రిపోర్టర్ చెంచు కాలనీలో సైతం సామాజిక స్థలాలను ఆక్రమించేందుకు తనదైన శైలిలో పథకం వేసి నకిలీ బీ ఫారాలను సృష్టించి రెవెన్యూ స్టాంపులను సైతం వేసి గ్రీన్ కలర్ ఇంకుతో సంతకాలు చేసి మరీ బేరసారాలు మొదలు పెట్టాడు. అయితే అది సామాజిక స్థలాలు కావడంతో కొలతలు వేసేందుకు వెళ్లిన ప్రైవేటు సర్వేయర్‌లను స్థానికులు నిలదీయడంతో అక్కడ నుంచి వెనుదిరిగారు.
- తన కుటుంబ సభ్యులకు సైతం సామాజిక స్థలాల్లో నకిలీ బీ ఫారాలు సృష్టించి గృహ నిర్మాణ శాఖ ద్వారా ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేశాడు. అయితే అప్పటికే ఈ వ్యవహారం గుట్టు రట్టవడంతో సదరు కాగితాలు బయటకు రాకుండా చూసుకున్నాడు. ఈ వ్యవహారం గ్రామంలో ఆ నోటా ఈ నోటా రావడంతో నకిలీ బీ ఫారాలతో స్థలాలు అమ్మకాలు జరిపిన వ్యవహారం బయటకు పొక్కి బాధితులు తమ నగదు తమకు తిరిగిచ్చేయాలని కోరడంతో తనకేం సంబంధం లేదు.. నాకేం తెలియదు అంటూ బుకాయించడం మొదలు పెట్టాడు.

ఫిర్యాదుకు రంగం సిద్ధం

పేద కుటుంబాలకు ఏదో న్యాయం చేస్తాడని మధ్యవర్తులుగా ఉన్న వ్యక్తులకు ఇది తలనొప్పిగా మారడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. రెవెన్యూ కార్యాలయంలో తాను అన్ని పనులు చేయిస్తానని కొంతమంది అధికారులతో చెట్టపట్టాలు వేసుకొని తిరుగుతున్న నేపథ్యంలో తాము నమ్మామని ఇలా మా కొంప ముంచుతాడని బాధితులు వాపోతున్నారు. తమపేరు బయటకు వస్తే ఎక్కడ బెదిరింపులకు గురిచేస్తారో అనే ఆందోళనతో బాధితులు సొమ్ము పోయి శనిపట్టిందని కన్నీటి పర్యంతమవుతున్నారు. అయితే ఈ వ్యవహారం సంబంధిత పత్రికా యాజమాన్యం దృష్టికి కూడా తీసుకెళ్లి బాధితులకు న్యాయం చేయాలని కోరినట్లు సమాచారం. నకిలీ పత్రాల వ్యవహారం ఇంతటితోనే ఆగిందా లేక ఇంకా ఏదైనా తప్పుడు పత్రాలు సృష్టించి మాఫియా చేశాడా అనే దానిపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సంబంధిత రెవెన్యూ అధికారులు ఇకనైనా దృష్టి సారించి నకిలీ పత్రాలతో పేదలను మోసం చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

తప్పకుండా చర్యలు తీసుకుంటాం..

దీనిపై తహసీల్దార్ మెహర్ కుమార్‌ను వివరణ కోరగా బయటి వ్యక్తులు మోసం చేసేందుకు రకరకాల తప్పులు చేస్తుంటారని, వాటితో మాకు సంబంధం లేదన్నారు. రికార్డుల్లో లేకుండా ఎవరైనా తప్పులు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. విలేకరి విషయం ఇంకా తమ దృష్టికి రాలేదని, వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

టీడీపీలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

ఇద్దరికి తీవ్రగాయాలు

గుంటూరు రూరల్: అధికార దాహం ఒక పక్క, అందినకాడికి దోచుకోవాలనే కాంక్ష మరో పక్క.. వెరసి ఇరువర్గాలు ఒకరిపై ఒకరు కర్రలు, రాడ్లు, రాళ్లతో దాడి చేసుకున్న సంఘటన సోమవారం రాత్రి చౌడవరం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గుంటూరు జిల్లా చౌడవరం గ్రామంలో టీడీపీ రాష్ట్ర మీడియా కో–ఆర్డినేటర్, స్థానిక ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు గింజుపల్లి వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు జరిగాయి. అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్న పలువురు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మద్యం తాగి పాత కక్షలను గుర్తు చేసుకుని ఒకరిపై ఒకరు కర్రలు, రాళ్లు, రాడ్లు, కత్తులతో దాడులు చేసుకున్నారు. గ్రామానికి చెందిన యడ్లపల్లి మణికంఠ, అతని స్నేహితుడు తూర్పుగోదావరి జిల్లా వాసి కాట్రగడ్డ ధర్మతేజ అలియాస్ టింకు అనే వ్యక్తి వారి అనుచరులతో ఈదులపాలెంకు చెందిన ఇమ్మెల శరత్ బాబును, అతని సోదరుడు ఎమ్మెల్యే రామస్వామిని కుర్చీలతో, రాళ్లతో తీవ్రంగా గాయపరిచారు. గతంలో శరత్‌బాబుకు, మణికంఠకు అక్రమ మైనింగ్ విషయంలో గొడవలు జరిగాయని స్థానికులు తెలిపారు. పాత కక్షలు మనసులో పెట్టుకొని తమను చంపటానికి ప్రయత్నం చేశారని శరత్‌బాబు తమ బంధువులకు తెలిపారని తెలిసింది. తనకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని బాధితుడు శరత్‌బాబు కోరుతున్నారు.



తీవ్ర గాయాలతో శరత్‌బాబు



రామస్వామి

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,000 గరిష్ఠం : రూ. 1,700

మోడల్ ధర రూ. 1,400



పసుపు ధరలు
(మంగళవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 934

కొమ్ములు : 812 బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ : (ధర రూ॥ల్లో)	మోడల్ :
9,400	10,775	10,400

కాయలు : 122 బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,400	10,775	10,350

మొత్తం అమ్మకాలు : 700.500 క్వింటాళ్లు

-దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం
(మంగళవారం ధరలు)

వచ్చిన బస్తాలు	53,761
అమ్మకాలు	52,228
నిల్వ	7,478



నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,000
నంబరు-5	10,000-13,300
341	10,000-13,400
సూపర్-10	10,000-13,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-12,600
నంబరు-5	10,000-13,500
341	10,000-13,500
4884	10,000-12,500
సూపర్-10	10,000-13,200

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 13,600
బాడిగ-355	10,000 - 12,300
దేవనూరు డీలక్స్	10,000 - 12,400
ఆర్మూర్	9,600 - 10,800
తాలుకాయలు	5,000 - 6,900

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-13,500
బాడిగ - 355	10,000-12,600
దేవనూరు డీలక్స్	10,000-12,500
తాలు	5,200 - 7,000

-కొరిటెపాడు (గుంటూరు)

పసుపు విత్తనం నాటడం ఇక తేలిక

- అందుబాటులోకి యంత్రం
- ఎకరానికి రూ.30 వేల నుంచి రూ. 40వేల వరకు తగ్గుతున్న ఖర్చు

కొల్లిపర: మండలంలో తొలిసారిగా బొమ్ము వేణు గోపాలరెడ్డి అనే యువ రైతు పసుపు విత్తనం నాటే యంత్రం(టర్మరిక్ ప్లాంటర్) కొనుగోలు చేసి దాని ద్వారా ముగ్గురు కూలీలతో అతి తక్కువ ఖర్చుతో పసుపు విత్తనం నాటటం ప్రారంభించాడు. యంత్రాన్ని ముందుగా ట్రాక్టర్‌కు అనుసంధానం చేయాలి. పై భాగాన ఉన్న కంటైనర్‌లో 300 కేజీలు దాకా పసుపు కొమ్ములు వేయాలి. యంత్రానికి ఇరువైపులా ఇద్దరు కూలీలను ఉంచాలి. ట్రాక్టర్ కదలగానే దానికి అనుగుణంగా చైన్ తిరుగుతుంది. ఈ క్రమంలో బాక్స్‌లో ఉన్న పసుపు కొమ్ములను కూలీలు యంత్రానికి అమర్చిన చిన్న చిన్న కప్పుల్లోకి ఒకటి రెండు ఉంచటం వల్ల అవి కిందకు వెళుతుంటాయి. అక్కడ రెండువైపులా ఉండే గొట్టాలు మట్టిలో నాలుగు అంగుళాల లోతులో బెజ్జం పెడతాయి. వెంటనే గిన్నెలోంచి దిగువకు వచ్చే విత్తనం గొట్టంలో నుంచి నేరుగా అదే బెజ్జంలోకి పడిపోతుంది. ఆ తర్వాత అడుగున ఉండే రేకు విత్తనంపై మట్టిని కప్పేస్తుంది. ఆ విధంగా ట్రాక్టర్‌కు అనుసంధానం చేసిన టర్మరిక్ ప్లాంటర్ సహాయంతో ఎత్తు మడులపై పసుపు విత్తనాన్ని నాటవచ్చు. కొమ్ములను నిర్ణీత దూరంలో క్రమపద్ధతిలో విత్తటం వల్ల పైరుకు ఎదిగిన తరువాత గాలీ, వెలుతురు ధారాళంగా అందుతుంది. దీంతో వర్షాలు ఎక్కువ కురిసినా, నీరు నిలబడినా పంటకు ఇబ్బంది ఉండదు. యంత్రం ద్వారా తక్కువ సమయంలో తక్కువ కూలీలతో పసుపును నాటవచ్చు.



కొల్లిపర మండలంలో యంత్రం ద్వారా పసుపు విత్తనం నాటుతున్న రైతులు

ఎకరానికి రూ.7వేలు వసూలు

యంత్రం ద్వారా ఎకరానికి నాలుగు పుట్లు (పుట్టు విత్తనం 225 కేజీలు) విత్తనం కొనుగోలు చేయాలి. తరువాత ఒక కొమ్మును రెండుగా చేసుకోవాలి. ఆ తర్వాత ముగ్గురు కూలీలతో రెండు గంటల్లోపు ఎకరంలో పసుపు విత్తనం నాటవచ్చు. దీంతో రైతుకు విత్తనం కొనుగోలులో మూడు పుట్లు తగ్గటంతో పాటు కూలీల వ్యయం కూడా తగ్గుతుంది. రోజుకు నాలుగు ఎకరాలల్లో విత్తనం నాటొచ్చు. ప్రస్తుతం ఎకరానికి రూ.7వేలు వసూలు చేస్తున్నారు. దీంతో పలువురు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

సీఆర్డీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక పాస్‌పోర్టు డ్రైవ్

తాడికొండ: ఈ నెల 22, 23 తేదీలలో విజయవాడ రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయం సౌజన్యంతో తుళ్ళూరులోని సీఆర్డీఏ కార్యాలయంలో ప్రత్యేక పాస్‌పోర్టు డ్రైవ్ నిర్వహించనున్నట్లు సీఆర్డీఏ కమిషనర్ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ డ్రైవ్‌లో రోజుకు 35 - 70 మందికి పాసుపోర్టు జారీ చేస్తామన్నారు. ఇందుకోసం అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జూలై 22-23 తేదీలలో స్లాట్ దొరకని వారు ఇతర తేదీలను ఎంచుకోవచ్చని, అధికారులు వాటిని డ్రైవ్ జరిగే తేదీలకు సర్దుబాటు చేస్తారని తెలిపారు. దరఖాస్తుదారులు నిర్ణీత ధ్రువపత్రాలతో జూలై 16-17 తేదీలలో తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో సైతం దరఖాస్తు చేసుకొనేందుకు సంప్రదించవచ్చన్నారు. రూ.1500 చెల్లించి స్లాట్ బుక్ చేసుకున్న అనంతరం జనరేట్ అయిన ఏఆర్ఎన్ నంబరును సీఆర్డీఏ సీనియర్ లైవ్‌లీ హుడ్ స్పెషలిస్ట్ సీహెచ్ శంకర్‌కు అందజేయాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సీఆర్డీఏ ఫెసిలిటేటర్, లేదా సీహెచ్ శంకర్ 9848424207కు కాల్ చేయాలని తెలిపారు. సాధారణ పాస్‌పోర్టు (మొదటి సారి) కోసం దరఖాస్తు చేసేందుకు అవసరమైన పత్రాలు ఆధార్ కార్డు లేదా జనన ధ్రువీకరణ పత్రంతో పాటు బర్త్ సర్టిఫికెట్, 10వ తరగతి సర్టిఫికెట్, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ, టీసీలలో ఏదైనా ఒకటి, ఆధార్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకం, ఓటర్ ఐడీ మూడింటిలో ఒకటి జతచేయాలన్నారు. పాత పాస్‌పోర్టు గడువు ముగిసినా లేదా రెన్యూవల్, పోయిన పాస్‌పోర్టులకు సంబంధించిన సేవలు ఈ డ్రైవ్‌లో లభ్యం కావన్నారు. పాస్‌పోర్టు సేవల రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్ కోసం అమరావతి ప్రాంత వాసులు తుళ్లూరులోని సీఆర్డీఏ కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు.

23,24 తేదీల్లో భవన నిర్మాణ సంఘం రాష్ట్ర మహాసభలు

లక్ష్మీపురం: ఈనెల 23, 24 తేదీల్లో పాత గుంటూరులోని శ్రీకృష్ణ కల్యాణ మండపంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం గుంటూరు బ్రాడీపేటలో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. గత ఏడు సంవత్సరాలుగా భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పనిచేయకపోవడం వల్ల కార్మికులకు జరుగుతున్న నష్టాన్ని చర్చించి భవిష్యత్ ప్రణాళికను ఈ మహాసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం రాజధాని నిర్మాణాల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించకపోవడం వారిని అవమానించడమేనన్నారు. సీఐటీయూ నగర కార్యదర్శి కె.శ్రీనివాసరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.కోటేశ్వరరావు, నగర తూర్పు, పశ్చిమ కమిటీల కార్యదర్శులు దీవెనరావు, ఎస్.కె.ఖాసీం వలి, దూదేకుల మస్తాన్ వలి, ఎలక్ట్రికల్ యూనియన్ నాయకులు సీతారామయ్య, బోయపాటి అక్కారావు, నికల్సన్, విమల్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దండా లక్ష్మీనారాయణ, సీఐటీయూ, కార్మిక సంఘం నాయకులు

నేడు మాజీ మంత్రి శైలజానాథ్ రాక

పొన్నూరు: ఈ నెల 3వ తేదీన టీడీపీ గూండాల దాడిలో గాయపడి ప్రాణాపాయ స్థితిలో గుంటూరు రమేష్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మన్నవ సర్పంచ్ బొనిగల నాగమల్లేశ్వరరావును పరామర్శించేందుకు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు సాకే శైలజానాథ్ బుధవారం విచ్చేయుచున్నట్లు వైఎస్సార్ సీపీ పొన్నూరు కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉదయం 10 గంటలకు శైలజానాథ్‌తో పాటు పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ హాస్పిటల్‌కు రానున్నారని తెలిపారు.

23 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం



గుంటూరు వెస్ట్: గృహావసరాలకు వాడుకోవాల్సిన గ్యాస్ సిలిండర్లను వ్యాపారం కోసం వాడుకుంటున్నారన్న వచ్చిన సమాచారం మేరకు సివిల్ సప్లయీస్ అధికారులు మంగళవారం ఉదయం దాడులు నిర్వహించి 23 డొమెస్టిక్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని కళ్యాణి టిఫిన్స్, వినాయక టిఫిన్స్, సత్య నాగా టిఫిన్స్ నుంచి ఈ సిలిండర్లు స్వాధీనం చేసుకుని 6ఏ కేసులు నమోదు చేశామని సివిల్ సప్లయీస్ డీటీ బేగ్ తెలిపారు.

22న మెగా జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22న బ్రాడీపేట 3వ లైనులోని మాస్టర్‌మైండ్స్ క్యాంపస్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ విద్యార్హతలు కలిగిన 18 నుంచి 25 ఏళ్ల లోపు వయసు గల నిరుద్యోగ యువతీ, యువకులు బయోడేటా, రెజ్యూమ్, విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో ఈనెల 22న ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరగనున్న ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. 20కి పైగా కంపెనీలు పాల్గొంటున్న జాబ్‌మేళాలో 679 ఉద్యోగావకాశాలు ఉన్నాయని తెలిపారు. వివరాలకు తమ ప్రతినిధులు వెంకట్ అల్లూరి (89195 08017), షేక్ ఎండీ రఫీ (88860 65546), ఎ.రామకృష్ణారెడ్డి (77319 82861) నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

డీఈఓ కార్యాలయం వద్ద ఎంటీఎస్ టీచర్ల ఆందోళన

పల్నాడు జిల్లాలోని పాఠశాలల్లో సర్దుబాటు వద్దంటూ నిరసన

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద మంగళవారం సాయంత్రం ప్రభుత్వ పాఠశాలల్లో మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) పద్ధతిపై పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఆందోళనకు దిగారు. పల్నాడు జిల్లాలోని దుర్గి, వెల్దుర్తి, బొల్లాపల్లి తదితర మండలాల్లో రెగ్యులర్ టీచర్ల బదిలీ కారణంగా ఖాళీగా ఉన్న పాఠశాలల్లో ఎంటీఎస్ పద్ధతిపై పనిచేస్తున్న టీచర్లను సర్దుబాటు చేసేందుకు మంగళవారం సాయంత్రం డీఈఓ కార్యాలయానికి రావాల్సిందిగా సమాచారం పంపారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 150 మంది ఎంటీఎస్ టీచర్లకు సమాచారం పంపడంతో సంబంధిత టీచర్లు డీఈఓ కార్యాలయానికి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. గతనెలలోనే తమను కౌన్సెలింగ్ ద్వారా వేర్వేరు పాఠశాలలకు పంపారని, మళ్లీ ఇప్పుడు కౌన్సెలింగ్ పేరుతో పల్నాడు జిల్లాలోని మారుమూల మండలాలకు వెళ్లాలని చెప్పడం ఏంటంటూ ఆందోళనకు దిగారు. కాగా, గుంటూరు, పల్నాడు జిల్లాల డీఈఓలు పి.వి.రేణుక, చంద్రకళ ఎంటీఎస్ టీచర్లతో మాట్లాడారు. డీఎస్సీ నియామకాలు జరిగి కొత్త టీచర్లు వచ్చే వరకు పల్నాడు జిల్లాలో విధులు నిర్వహించాలంటూ ఎంటీఎస్ టీచర్లకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఎంటీఎస్ టీచర్ల అంగీకరించలేదు. ఫలితంగా కౌన్సెలింగ్ నిలిచిపోయింది.

కార్పొరేట్ హాస్టళ్లలో తనిఖీలు

- బహుళ అంతస్తుల భవనాలు, సెల్లార్లలో తరగతులు, మురికి టాయిలెట్లు, అధ్వాన డైనింగ్ హాళ్లు
- నిర్వాహకులపై బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి ఆగ్రహం
- కనీస వసతులు లేకపోవడం, అపరిశుభ్ర వాతావరణంపై మండిపాటు



శ్రీచైతన్య కాలేజీ హాస్టల్ క్యాంపస్‌ను తనిఖీ చేస్తున్న బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి

గుంటూరు ఎడ్యుకేషన్: కార్పొరేట్ జూనియర్ కళాశాలలు నడుపుతున్న హాస్టల్ క్యాంపస్‌లలో అధ్వాన పరిస్థితులపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గుంటూరు శివారు రెడ్డిపాలెంలోని శ్రీచైతన్య, భాష్యం, విజ్ఞాన్ జూనియర్ కళాశాలలకు చెందిన హాస్టళ్లను ఆమె విద్యాశాఖాధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా హాస్టళ్లలో నెలకొన్న సమస్యలపై ఆమె విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. రెడ్డిపాలెంలోని శ్రీచైతన్య పాఠశాలలో డైనింగ్‌హాలు, టాయిలెట్లు, హాజరు పట్టికలను పరిశీలించారు. అనుమతులు లేకుండా ఎల్‌కేజీ, యూకేజీ తరగతుల నిర్వహణ, గాలి, వెలుతురు లేకపోవడం, తగిన విద్యార్హతలు లేని ఉపాధ్యాయులతో బోధన, టాయిలెట్ల అపరిశుభ్రత, ఫీజుల వివరాలు నోటీసు బోర్డులో ప్రదర్శించకపోవడం చూసి పాఠశాల నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

■ నాలుగు అంతస్తుల భవనంలో వందలాది మంది విద్యార్థులను ఉంచడంతో పాటు సెల్లార్‌లో స్టడీ అవర్స్ నిర్వహించడంపై పాఠశాల ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. నాణ్యత లేని ఆహారాన్ని పిల్లలకు అందించడంతో పాటు అనేక లోపాలను గుర్తించారు. బాలల రక్షణ, సంరక్షణ కోసం అమలు చేస్తున్న చట్టాల్లో పేర్కొన్న నిబంధనలేవీ పాటించకపోవడాన్ని గుర్తించిన పద్మావతి, తక్షణమే వాటిని సరిదిద్దుకోవాలని, లేని పక్షంలో కమిషన్ చట్టపరంగా చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

■ కళాశాల, పాఠశాల హాస్టల్ క్యాంపస్‌లలో ఫిర్యాదుల బాక్సులు లేకపోవడం, విద్యార్థినులు నివశిస్తున్న గదుల్లోనే వస్త్రాలను ఆరబెట్టుకోవడం, ఒక్కో గదిలో 20 మంది విద్యార్థినులు ఉండటాన్ని గమనించారు. రన్నింగ్ వాటర్ లేకపోవడంతో పాటు కళాశాలలో హెల్ప్‌లైన్ నంబరు సైతం లేకపోవడం, ఆయా కళాశాలల హాస్టళ్లకు అనుమతులు ఏ విధంగా ఇచ్చారంటూ అధికారులను ప్రశ్నించారు. ఆమె వెంట ఆర్‌ఐఓ జి.సునీత, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి పి.ప్రసన్న, అర్బన్ సీడీపీఓ జి.అరుణ, న్యాయ, పర్యవేక్షణాధికారి బి.వాసంతి, డీవైఈఓ జి.ఏసురత్నం, ఎంఈఓలు అబ్దుల్ ఖుద్దూస్, జ్యోతి కిరణ్, నాగేంద్రమ్మ, పి.నీలిమ పాల్గొన్నారు.

20న బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక

గుంటూరు వెస్ట్(క్రీడలు): గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ ఉదయం 8 గంటలకు స్థానిక ఎన్జీఓ క్లబ్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా సబ్ జూనియర్స్, సీనియర్స్ పురుషుల, మహిళల జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తామని అసోసియేషన్ అధ్యక్షులు ఇ.శివశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్స్ విభాగంలో పాల్గొనే చిన్నారులు జనవరి 2, 2010 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. పోటీలకు హాజరయ్యే వారు వయస్సు ధ్రువీకరణ పత్రంతోపాటు ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 83477 85888 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జీడీసీఏ జిల్లా అధ్యక్షుడిగా రాకేష్ చౌదరి

గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్(జీడీసీఏ) నూతన అధ్యక్షుడిగా చుక్కపల్లి రాకేష్ చౌదరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని జీడీసీఏ ఉపాధ్యక్షుడు తోట వెంకట శివ రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నిర్వహించిన ఎన్నికలకు ఎలక్షన్ ఆఫీసర్‌గా వెంకటరత్నం వ్యవహరించారన్నారు. కార్యదర్శిగా ఎనుముల శ్రీధర్, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ కొంగర రాహుల్ చౌదరి, ఉపాధ్యక్షుడిగా తోట వెంకట శివరామకృష్ణ, కోశాధికారిగా సింగరాజు లక్ష్మీకాంత్, కౌన్సిలర్‌గా నందిరాజు శివ రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు.



మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల భిక్షాటన

బాపట్ల: మునిసిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె మంగళవారం నాటికి నాలుగో రోజుకు చేరింది. ప్రభుత్వం నుంచి స్పందన కనిపించకపోవడంతో కార్మికులు పట్టణంలో భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరం నుంచి పాత బస్టాండ్ వరకు ప్రదర్శన నిర్వహించారు. కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మె నిర్మించేది లేదని సీఐటీయూ నాయకులు మజుందార్ పేర్కొన్నారు. ప్రభుత్వం ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన కోర్కెలు తీర్చకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తాత్కాలికంగా ప్రైవేటు వర్కర్లతో పనులు చేయించుకున్నప్పటికీ అది శాశ్వత పరిష్కారం కాదన్నారు. సమస్య శాశ్వతంగా పరిష్కారం అయ్యే వరకు సమ్మెబాట వీడేది లేదన్నారు.



భిక్షాటన చేస్తున్న ఉద్యోగులు

కన్న కొడుకునే కడతేర్చాడు

- ముక్కలుగా నరికి, పూడ్చిపెట్టిన వైనం
- కుమారుడి అదృశ్యంపై మృతుడి పిన్ని ఫిర్యాదుతో వెలుగులోకి ఘటన
- విచారణలో మరిన్ని విస్తుపోయే వాస్తవాలు
- 2014లో తల్లిని, తండ్రిని చంపిన దుర్మార్గుడు
- విషయం తెలిసి తీవ్ర కోపోద్రిక్తులైన క్రోసూరు మండలం యర్రబాలెం గ్రామస్తులు

జీవాల్లో వాటా అడిగినందుకు కొడుకును చంపిన తండ్రి



ఘటనాస్థలం వద్ద నిందితుడు వెంకటేశ్వర్లు నాయక్‌తో సీఐ పి.సురేష్



మీడియాతో మాట్లాడుతున్న మృతుడి తల్లి కోటేశ్వరీబాయి

క్రోసూరు: తాను సొంతంగా జీవించేందుకు, మేపు కొనేందుకు జీవాల్లో వాటా అడిగిన కుమారుడిని కన్న తండ్రే కడతేర్చిన హృదయ విదారక ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. అచ్చంపేట మండలం పుట్లగూడెం గ్రామానికి చెందిన బూక్యా వెంకటేశ్వర్లు నాయక్, కుమారుడు మంగ్యానాయక్(19)లు జీవాలు మేపుతూ జీవనం సాగిస్తుంటారు. ఈక్రమంలో మూడు నెలల క్రితం క్రోసూరు మండలంలోని యర్రబాలెం గ్రామానికి జీవాలు మేపుకొంటూ వలస వచ్చారు. అయితే ఈనెల 3వ తేదీ నుంచి తమ కుమారుడు కనిపించడం లేదని నిందితుడి రెండో భార్య, మృతుడి పిన్ని ప్రమీలాభాయి ఈనెల 12వ తేదీన క్రోసూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన భర్తపైనే అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొంది. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా.. తన కుమారుడిని తానే చంపినట్లు వెంకటేశ్వర్లు నాయక్ అంగీకరించాడు. ఈనెల 3వ తేదీ రాత్రి జీవాల్లో వాటా అడిగినందుకు కొట్టి చంపి, ముక్కలు చేసి, పూడ్చిపెట్టినట్లు ఒప్పుకొన్నాడు. మృతదేహం పూడ్చిపెట్టిన ప్రదేశాన్ని పోలీసులకు చూపించాడు.



మృతుడు మంగ్యానాయక్ (ఫైల్)

కోపోద్రిక్తులైన స్థానికులు

సీఐ పి.సురేష్, తహసీల్దార్ వీవీ నాగరాజు సమక్షంలో మంగ్యానాయక్ మృతదేహాన్ని పంచానామా చేసేందుకు వెలికి తీశారు. అన్నెంపున్నెం ఎరుగని కుమారుడిని చంపడంపై క్రోపోద్రిక్తులైన స్థానిక ప్రజలు, పుట్లగూడెం నుంచి వచ్చిన బంధువులు నిందితుడ్ని వదిలిపెట్టకూడదని తమకు అప్పగిస్తే తామే శిక్ష వేస్తామని నిందితుడిని పోలీసుల దగ్గరనుంచి లాక్కునే యత్నం చేశారు. ఈక్రమంలో పోలీసులు లాఠీచార్జి చేసి ప్రజల్ని తరిమివేసి నిందితుడిని పోలీసుస్టేషన్ తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

కన్న తల్లిదండ్రులను చంపిన కసాయి

విచారిస్తున్న క్రమంలో క్రోసూరు పోలీసులకు మరిన్ని విస్తుపోయే వాస్తవాలు వెల్లడయ్యాయి. వెంకటేశ్వర్లు నాయక్ క్రూర నేర చరిత్ర బయల్పడింది. 2014 సంవత్సరంలో తన సొంత తల్లిని అడవిలో నరికి చంపిన కేసులో ప్రస్తుతం బెయిల్ పై ఉన్నాడని తేలింది. అనంతరం తన తండ్రిని సైతం హతమార్చాడని, కొన్నాళ్లు జైలు జీవితం గడిపాడని.. తన 3 నెలల కుమారుడిని సైతం చంపివేసిన కేసులో కూడా ఉన్నప్పటికీ సాక్ష్యాలు బలంగా లేని కారణంగా ఆ కేసు నిలవలేదని నిందితుడి మొదటిభార్య, మృతుడి తల్లి కోటేశ్వరీభాయి, గ్రామస్తులు సంఘటనా స్థలంలో మీడియాకు వివరించారు. అచ్చంపేట సీఐ పి.శ్రీనివాసరావు, ఎస్ఐ రవిబాబు కేసును విచారిస్తున్నారు.